'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

గురుకులాల గోస

బీఆర్‌ఎస్ హయాంలో వికాసానికి చిరునామాగా వెలుగొందిన గురుకులాలు నేడు నిర్లక్ష్యం నీడలో నీల్గుతున్నాయి. ఆత్మహత్యలు, ఫుడ్ పాయిజనింగ్, లైంగిక వేధింపులకు అవి నెలవుగా మారాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన గత 8 నెలల్లోనే 36 మంది విద్యార్థులు మృతిచెందారు. 500 మందికి పైగా అస్వస్థతకు గురయ్యారు. ఇంత జరుగుతున్నా ఏమీ జరగలేదన్నట్టుగానే సర్కారు వ్యవహరిస్తున్నది. రాజకీయాలకు పోయి విద్యార్థుల బతుకులను ఆగం చేయొద్దని బీఆర్‌ఎస్ నేత కేటీఆర్ పదే పదే హెచ్చరిస్తున్నా చెవికెక్కించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో జగిత్యాల జిల్లా పెద్దాపూర్ గురుకులం విద్యార్థి పాముకాటుకు గురై చనిపోవడం విషాదకరం. బాధిత కుటుంబాన్ని కేటీఆర్ స్వయంగా వెళ్లి ఓదార్చడమే కాకుండా గురుకులాల సమస్యలపై అధ్యయనం చేసేందుకు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ నేతృత్వంలో కమిటీ వేస్తామని ప్రకటించటంతో సర్కారులో కదలిక వచ్చింది.

కాంగ్రెస్ ప్రభుత్వం తమ పరువును కాపాడుకునేందుకు మంత్రులను తరిమింది. బాధిత కుటుంబాలను కలిసేందుకు వెళ్లిన మంత్రులు హడావుడి చేశారు. కానీ, ఇతర పిల్లల తల్లిదండ్రులు మంత్రులను కలుసుకోవడానికి ప్రయత్నిస్తే పోలీసులు అడ్డుకోవడం సర్కారు చిత్తశుద్ధిని తెలియజేస్తున్నది. అంతేకాదు, గురుకులాల్లో ఏసీబీ, ఫుడ్ సేఫ్టీ తనిఖీలు జరుగుతున్నట్టు వార్తలు వస్తున్నాయి. అనేక గురుకులాల్లో నాణ్యత లేని, గడువు ముగిసిన ఆహార పదార్థాలు పట్టుబడుతున్నాయి. పెద్దాపూర్ ఘటన రేపిన దుమారం సమసిపోకముందే జగిత్యాల జిల్లాలోని గొల్లపల్లి గురుకుల విద్యార్థులు అస్వస్థతకు గురవడం గమనార్హం. కేసీఆర్ పాలనలో దేశానికే ఆదర్శంగా నిలిచిన మన గురుకుల వ్యవస్థ నేడు ఏ స్థాయికి దిగజారిపోయిందో ఈ ఘటనలు తెలియజేస్తున్నాయి.

బిడ్డల చదువుకు పేదరికం ఆటంకం కాకూడదని ఆలోచించిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గురుకుల వ్యవస్థను పటిష్ఠపరిచారు. అందులో భాగంగానే గురుకులాల సంఖ్యను వెయ్యికి పైగా పెంచారు. గురుకులాల్లో సౌకర్యాలకూ పెద్దపీట వేశారు. వాటిల్లో విద్యనభ్యసిస్తున్న పిల్లలకు సన్నబువ్వతో పాటు పోషకాహారాన్ని అందించారు. ఒక్కో విద్యార్థిపై సగటున ఏడాదికి రూ.1.25 లక్షలు ఖర్చుచేయడమే అందుకు నిదర్శనం.బీఆర్‌ఎస్ ప్రభుత్వ కృషి, వ్యయం వృథా పోలేదు. గురుకుల విద్యార్థులు చదువుల్లో రాణించడమే కాదు, పోటీ పరీక్షల్లో కార్పొరేట్‌కు దీటుగా ర్యాంకులు తెచ్చుకున్నారు. ఐఐటీ, ఎన్‌ఐటీ, మెడిసిన్ సీట్లలోనూ తమ సత్తా చాటారు. కానీ, ఇప్పటి కాంగ్రెస్ పాలకులు గురుకులాల నిర్వహణపై పెద్దగా దృష్టి సారించడం లేదు. ఇతర రంగాల వలె కేసీఆర్ స్థాపించి నిలబెట్టిన గురుకులాలపైనా కాంగ్రెస్ ఏలికలు శీతకన్ను వేశారు. దాని ఫలితంగానే గురుకులాల పతనం మొదలైంది. దీంతో బడుగు బలహీన వర్గాలకు చెందిన పిల్లల భవిష్యత్తు డోలాయమానంలో పడింది. ఇది ఏ మాత్రం క్షమార్హం కాదు. ఇప్పుడు కావాల్సింది కంటితుడుపు చర్యలు కాదు, గురుకులాల వ్యవస్థలో సమూల ప్రక్షాళన. సర్కారు చిత్తశుద్ధితో వ్యవహరించి గురుకులాల పతనాన్ని అడ్డుకోకపోతే బడుగుల చదువులకు తీరని అన్యాయం చేసినట్టవుతుంది.

రిజర్వేషన్లు ఉమ్మడి సంపద

గత లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో బలహీనపడిన బీజేపీ రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ర్టాలు చేజారిపోకూడదని కొన్ని నష్ట నివారణ చర్యలను చేపట్టింది. 'అగ్నివీర్' పథకం నిబంధనల సడలింపు ప్రక్రియ ఇందులో భాగమే. బడ్జెట్‌పై కూడా దీని ప్రభావం కనబడుతున్నది. ఈ నెల ఒకటిన సుప్రీంకోర్టు ఎస్సీ, ఎస్టీల వర్గీకరణపై ఇచ్చిన అనుకూల తీర్పును కూడా ఈ లెక్కలో వేయవచ్చు.

బి.నర్సన్
94401 28169



కోర్టుల్లో సుదీర్ఘకాలం వాయిదాలు పడే కీలక కేసులన్నీ ప్రభుత్వ కనుసన్నల్లోనే దాగుడుమూతలు ఆడుతుంటాయి. బీజేపీతో మందకృష్ణ చేయి కలిపినందుకు తెలంగాణలో 8 లోక్‌సభ స్థానాలు దక్కాయని ఆ పార్టీ నమ్ముతున్నది. తెలంగాణ, ఏపీ రాష్ర్టాల్లో బీజేపీకి మాదిగల మద్దతును ఈ తీర్పు పెంచుతుంది. జనాభా దృష్ట్యా తెలంగాణలో మాదిగ, మాలల నిష్పత్తి 2:1గా ఉన్నది. ఏపీలో ఇక్కడి కన్నా మాలల జనాభా కాస్త ఎక్కువే. మొత్తంగా ఎస్సీ కులాల జాబితాలో 61 ఉపకులాలున్నాయి. ఇప్పటికీ రిజర్వేషన్ ప్రయోజనాలను ఒక్క తరం కూడా అందుకోని ఉపకులాలు ఆ జాబితాలో ఎన్నో ఉన్నాయి. వీటిలో చాలా ఉపకులాల జనాభా వందలు, వేలల్లో ఉండగా లక్షల సంఖ్యలో ఉన్నవారు మాదిగలు, మాలలు మాత్రమే. వీరి తర్వాత లక్ష లోపు జనాభా గల ఉపకులాలుగా తెలంగాణలో నేతకాని, బుడగ జంగాలు వస్తాయి. బైండ్ల, డక్కలి, చిందు కులాలు కూడా మాదిగల్లోకే వస్తాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం.. దేశ జనాభాలో ఎస్సీలు 7 శాతం ఉండగా, తెలంగాణలో 19 శాతం, ఏపీలో 23 శాతం ఉన్నారు. ఆ లెక్కల ప్రకారం తెలంగాణలో మాదిగలు 32.33 లక్షలు ఉండగా, మాలలు 15.27 లక్షలు ఉన్నారు. 2014లో అప్పటి తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సర్వేలో ఎస్సీల జనాభా 63,60,158 అని తేలింది. నిష్పత్తి ప్రకారం చూస్తే మాదిగలు 42 లక్షల మంది ఉండే అవకాశం ఉన్నది.

> **ఉమ్మడి ఏపీలో ఆంధ్రా ప్రాంతంలో మాలలు చదువు, వ్యవసాయంలో మాదిగల కన్నా ముందున్నారని తెలిపే అధ్యయనాలున్నాయి. మాదిగలు తమ కుల, చేతివృత్తులను పట్టుకొనే ఉండగా మాలలు చదువు, వ్యాపారాల్లోకి వెళ్లారని, తద్వారా రిజర్వేషన్ల ఫలాలు వారికే ముందుగా, ఎక్కువగా దక్కుతున్నాయని మాదిగల వేదన, వాదన.**

చదువుల్లో, ఉద్యోగాల్లో, పదవుల్లో న్యాయమైన వాటా దక్కాలంటే తమలో కూడా బీసీల మాదిరి కుల వర్గీకరణ తప్పనిసరి అని నష్టపోతున్నవారు చాలాకాలంగా కోరుకుంటున్నారు. ఎస్సీల వర్గీకరణ కోసం మాదిగల నేతృత్వంలో 1990 నుంచి ఆందోళన కొనసాగుతున్నది. మాలలు ఈ డిమాండ్‌ను వ్యతిరేకించడంతో రెండు కులాల మధ్య కొంత ఎడబాటు కూడా ఏర్పడింది.

20 ఏండ్లుగా సుప్రీంకోర్టులో నానుతున్న కేసులో తమ అభీష్టం మేరకు తీర్పు రావడంతో మాదిగల్లో ఆనందం వెల్లివిరిసింది. ఎన్నికల సమయంలో మందకృష్ణ మాదిగ ప్రధాని మోదీతో కలిసిపోవడాన్ని విమర్శించిన వారున్నారు. పార్టీ విధానాల పరంగా బీజేపీని వ్యతిరేకిస్తున్న మాదిగ కులస్థుల వర్గం మంద కృష్ణ నిర్ణయాన్ని బహిరంగంగా తప్పుపట్టింది. సొంత భావజాల పరంగా చూస్తే వ్యక్తిగా మంద కృష్ణ కూడా ప్రధాని మోదీ శరణులోకి వెళ్లడం విచిత్రమే. కోర్టులో కేసు కదలడానికి, అనుకూల తీర్పునకు ఇదే అదనుగా భావించిన మంద కృష్ణ ప్రధాని ముందు బహిరంగంగా కన్నీళ్లు పెట్టుకొని సెంటిమెంట్‌తో లొంగదీసుకున్నాడు. అది బహిరంగ ఎన్నిక ప్రచార వేదిక కాబట్టి వర్గీకరణపై కమిటీ వేస్తామని మోదీ సభాముఖంగా ప్రకటించారు. రెండు రాష్ర్టాల్లో ఎన్నికల ఫలితాలు బీజేపీకి శుభకరంగా ఉండటంతో ఈ వర్గీకరణకు కాలం కలిసివచ్చినట్లయింది.

మాల, మాదిగ.. రెండు కులాలు దళిత జాతివే అయినా రెండింటి మధ్య సంస్కృతి, సంప్రదాయాలపరంగా చాలా భేదాలున్నాయి. ఒకరి పిల్లను ఒకరు చేసుకోరు. ఎవరి అయ్యవార్లు వారికున్నారు. మాదిగల కన్నా మేము గొప్ప అనే భావన మాలల్లో అన్ని విషయాల్లోనూ కనబడుతుంది. రెండు భిన్న కులాల్లో ఉండే సహజ వ్యత్యాసాలుగా వీటిని చూడవచ్చు. ఇదంతా కాలమాన జీవన విధానంలో భాగమే తప్ప కోరి విభేదిస్తున్నది కాదు. అయితే, సంఖ్యాపరంగా ఎక్కువున్న ఈ రెండు ఎస్సీ కులాల మధ్య రాజ్యాంగ ప్రయోజనాలు కూడా సమతూకంగా ఉండాలని అందరు కోరుకుంటారు.

నిజానికి ఈ సమస్యను కోర్టులో, ప్రభుత్వాలో తీర్చవలసిన అవసరం లేదు. అంబేద్కర్ ఆలోచనాసారాన్ని దళితులంతా ఆచరణలో చూపవలసిన బాధ్యత వారిపై ఉన్నది. రిజర్వేషన్లు ఎస్సీ, ఎస్టీల ఉమ్మడి ఆస్తి. తండ్రి ఆస్తిని పిల్లలు పంచుకునే న్యాయపద్ధతి ఇక్కడ అవసరం. ఒకే కడుపులో పుట్టిన బిడ్డలు తాము సమానంగా ఎదగాలని, ఆర్థికంగా బలహీనంగా ఉన్న తోబుట్టువులకు ఎక్కువ పాలు ఇవ్వాలని కోరుకుంటారు. పెద్దలు చెప్పిన పంపకాన్ని ఒప్పుకుంటారు. ఆస్తి విషయంలో పిల్లలు గొడవకు దిగితే పోయేది కుటుంబ పరువేనన్న స్పృహ అవసరం. దాయాదులుగా కాకుండా అన్నదమ్ముల్లా ఆలోచించాలి. మాల, మాదిగలు సామరస్యంగా తమ వాటాల నిర్ణయాన్ని ప్రభుత్వం ముందుపెడితే ఇంత కాలహరణ జరిగేది కాదు. రిజర్వేషన్లు మనవి, దాని లెక్కలు మనమే తేల్చుకుందామనే ధోరణి ఇప్పటికైనా అవసరమే.

> **సుప్రీంకోర్టు వర్గీకరణ బాధ్యతను రాష్ర్టాలకే కట్టబెట్టింది. పాలక పార్టీ పెద్దలు స్వలాభం కోసం ప్రభుత్వ నిర్ణయాలను ప్రభావితం చేసే అవకాశం ఉన్నది. మళ్లీ ఫలితాలు ఏకపక్షంగా ఉంటే తీర్పు ప్రయోజనం ఒనగూడదు. ఇప్పటికే క్రీమీలేయర్ వర్తింపుని కేంద్ర క్యాబినెట్ వ్యతిరేకించింది. కాంగ్రెస్ కూడా దానికి వత్తాసుగా ప్రకటనలు చేస్తున్నది.**

మేమంటే మేము ముందు వర్గీకరణ చేపడుతామని మన రాష్ట్ర ప్రభుత్వాలు అంటున్నాయి కానీ, చేతికి అందేదెప్పుడో, అందేదెమిటో చెప్పలేం. రాజకీయ ప్రయోజనాలను మాత్రమే కోరుకునే పార్టీలను గుడ్డిగా నమ్మలేం. రెండు, మూడు తరాలుగా ఫలాలను అనుభవిస్తున్న రాజకీయ నేతలకు ఈ తీర్పు మింగుడు పడనిదే. కమిటీలు, రిపోర్టులు అంటూ కాలయాపన చేయవచ్చు. రిజర్వేషన్ల రక్షణ, సమపాళ్ల అమలుకోసం ఎస్సీ, ఎస్టీలు ఇప్పటికైనా విభేదాలు వదిలి ఉమ్మడిగా కృషిచేయాలి. ఒకరి కాలు ఒకరు లాగితే లాభపడేవి రాజకీయ పార్టీలే.

నోరు విప్పి నిజం చెప్పండి!

సెబీ చైర్‌పర్సన్ బుచ్, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లకు బహిరంగ లేఖ

గౌరవనీయులైన మాధవీ పూరి బుచ్, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్

విషయం: సెబీకి మూడు ప్రశ్నలు

అదానీ గ్రూప్‌కు సంబంధించిన విషయాలను హిండెన్‌బర్గ్ బహిర్గతం చేసినందున 94 ఏండ్ల జార్జ్ సోరోస్‌ను విమర్శించేందుకు, విదేశీ హస్తం ఉందని నిందించేందుకు బీజేపీని అనుమతించడం ద్వారా భారత దేశ గౌరవనీయ మార్కెట్ రెగ్యులేటరీ సంస్థ వెర్రివెంగళప్పలా మారుతున్నది. ఇది హాస్యాస్పదమని మీకూ తెలుసు. నాకూ తెలుసు. తర్వాత వారు టేలర్ స్విఫ్ట్‌పైనే ఆరోపణలు చేస్తారు. అనుమానపు వేలు ఇప్పుడు వారి అగ్రనాయకత్వం వైపే చూపెడుతున్నది. అందుకే బీజేపీ ఇప్పుడు ఆందోళనలో పడింది. రామ్‌దేవ్ బాబా ధ్యానాన్ని స్ఫూర్తిగా తీసుకుని, విశ్రాంతి తీసుకోవాలని ఆందోళనలో ఉన్న బీజేపీకి మీరు చెప్పండి. మీలో కొందరు నిపుణులు, బ్యూరోక్రాట్లు ఉన్నారు. మీ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు బీజేపీని ఎందుకు అనుమతిస్తున్నారు? అబద్ధాల్లో ఆరితేరిన, బురదజల్లడంలో ప్రావీణ్యం సాధించిన పార్టీ వారిది. ప్రజలకు నిజానిజాలను చెప్పడం మీ కర్తవ్యం.

సెబీ బోర్డుకు మూడు సాదాసీదా ప్రశ్నలు

1. హిండెన్‌బర్గ్‌ను కాసేపు పూర్తిగా పక్కనపెట్టండి. 2014(ఎన్డీయే అధికారంలోకి వచ్చినప్పుడు)లో 4.5 బిలియన్ డాలర్లున్న అదానీ నెట్‌వర్త్.. 2020లో 11 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఆ తర్వాత 2021 నాటికీ అనూహ్యంగా 76 బిలియన్ డాలర్లకు చేరుకున్నది. 2022లో 150 బిలియన్ డాలర్లకు ఎగబాకింది. ఇదంతా వ్యాపారమేనని మీరు అనుకుంటున్నారా? షేర్ ధరల అవకతవకలను సుమోటోగా తీసుకొని మీరు ఎందుకు దర్యాప్తు చేయడం లేదు? అదానీ గ్రూప్ క్యాపిటలైజేషన్ అబ్బురపరిచే వృద్ధిపై మీరు వివరణ ఇవ్వాలి. ప్రత్యేకించి, మోదీ ప్రభుత్వంతో ఉన్న సంబంధం గురించి.

2. 2022లో కేవలం 7 అదానీ గ్రూప్ కంపెనీలు బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ వృద్ధిలో 80 శాతం వాటాను కలిగి ఉండటం ఆశ్చర్యకరం. ఇదంతా చూస్తే కామర్స్ మొదటి సంవత్సరం చదివే విద్యార్థి 'అరె! అసలు ఏం జరుగుతున్నది?' అని కనుబొమ్మలు ఎగురవేస్తాడు. కానీ, షేర్ ధర పెరుగుదలలో వారి పాత్రపై ఉన్నతస్థాయి దర్యాప్తు జరపాలని సెబీ అనుకోలేదు. ఇదేమీ ఆషామాషీ వ్యవహారం కాదు కదా! అసలు దీన్ని ఎవరైనా నమ్ముతారని మీరు అనుకుంటున్నారా? షేరు విలువ/ ఆర్జన నిష్పత్తి గురించి పరిశీలించాలని మీకు అనిపించలేదా? మీరు ఏం విస్మరించారో లేదా కావాలని నిర్లక్ష్యం చేశారో చూద్దాం. (అదానీ పవర్ పీఈ 769 వద్ద ఉన్నప్పుడు టాటా పవర్ 34 వద్ద ట్రేడవుతున్నది. అదానీ గ్యాస్ 747 వద్ద ఉండగా.. దాని ప్రత్యర్థి కంపెనీ ఇంద్రప్రస్థ గ్యాస్ 17 వద్దే ఉంది. దయచేసి వారి వార్షిక నివేదికలను చదవండి. ఎలాంటి ఆర్థిక పరిమితులు దీన్ని సమర్థించవు).

> **కఠినమైన వాస్తవం ఏమిటంటే.. మార్కెట్లతో ఆటలాడుతున్నప్పుడు మీరు మీ బాధ్యతలను విస్మరించి నిద్రమత్తులో జోగుతున్నారు. కేవైసీలు, డిజిటల్ చెల్లింపులు, నగదు బదలాయింపులకు సంబంధించిన శాశ్వత డిజిటల్ సాక్ష్యాధారాలను నమోదు చేస్తున్న యుగంలో మనం ఉన్నాం. హిండెన్‌బర్గ్ అనుమానాలను లేవనెత్తింది. కానీ, ఏడాది పాటు దర్యాప్తు చేసిన తర్వాత కూడా ఎలాంటి సాక్ష్యాధారాలు లేవని సెబీ తేల్చిచెప్పింది. ఇదెలా ఉందంటే.. ఒలింపిక్స్‌కు ప్యారిస్ ఆతిథ్యమిచ్చినట్టు రుజువులు చూపమని అడిగినట్టుగా ఉంది.**

3. అదానీ షేర్లలో విదేశీ ట్యాక్స్ హావెన్స్‌కు సంబంధించి సుప్రీంకోర్టు పర్యవేక్షణలో జరుగుతున్న దర్యాప్తు పూర్తయితే పెద్ద తలకాయలు బయటపడతాయి కనుక దర్యాప్తును నిదానంగా, సులభంగా బయటపడేలా లేదా మొత్తంగా దర్యాప్తును ధ్వంసం చేయాలని మీపై ఆర్థిక మంత్రిత్వ శాఖ లేదా పీఎంవో నుంచి ఒత్తిడి వచ్చిందా? మీరేమైనా కీలుబొమ్మలా? అదే కనుక నిజమైతే మీరు నోరు విప్పాలి. పైన పేర్కొన్న వాటికి మీ పారదర్శక ప్రతిస్పందన 'సన్‌లైట్'(ఒకప్పటి ఫేమస్ డిటర్జెంట్ సబ్బు)లా సాయపడుతుంది. అంటే దానర్థం.. సూర్యకాంతి అన్నింటినీ పరిశుద్ధం చేస్తుంది కదా!



సంజయ్ ఝా
రాజకీయ విశ్లేషకులు

కొండెక్కిన న్యాయం ఖరీదు!

ఫిరోజ్ ఖాన్
96404 66464

ఒకరు ఆటో డ్రైవర్. అతడి నెల సంపాదన రూ.10 వేలు. రోజూ పనిచేస్తేనే గాని పూట గడవని పరిస్థితి. మరొకరు పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో కీలక పోస్టులో ఉన్న వ్యక్తి. లక్షన్నరకు పైగా జీతం. పక్కపక్కనే ఉండే వీరి మధ్య ఇంటి స్థలం విషయంలో వివాదమైంది. మున్సిపల్ కార్యాలయం, కలెక్టరేట్, సీఎంవోల చుట్టూ ఆటోడ్రైవర్ తిరుగగా.. అతని స్థలంతో కొంత భాగాన్ని సదరు పోలీసు కబ్జా చేసినట్టు నిర్ధారణ అయింది. అయితే సదరు పోలీసు ముందుగా జిల్లాలోని సివిల్ కోర్టు, ఆపై హైకోర్టులో కేసు వేశాడు. దీంతో ఆ ఆటోడ్రైవర్ న్యాయం కోసం కోర్టులు, న్యాయవాదుల చుట్టూ తిరగాల్సి వస్తున్నది. లాయర్ల ఫీజు అతనికి భారంగా మారింది. న్యాయం చేయాల్సిన పురపాలక అధికారులు కేసు కోర్టులో ఉన్నదనే సాకుతో తప్పించుకుంటున్నారు. ఆటోడ్రైవర్ ఆర్థిక పరిస్థితి గురించి పూర్తిగా అవగాహన ఉన్న సదరు పోలీసు అక్రమ నిర్మాణం కొనసాగిస్తున్నాడు. పాపం ఆ ఆటోవాలా న్యాయం కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నాడు.

ఇది ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన ఓ ఘటన. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి బాధితులు ఎందరో. భూ బకాసురులను ఎదుర్కోలేక.. డబ్బు, అధికార మదంతో విర్రవీగేవారిని నిలువరించలేక చాలామంది పేదలు నిస్సహాయులుగా ఉండిపోతున్నారు. లక్షల్లో ఖర్చుపెట్టి న్యాయం పొందడం పేద ప్రజల వల్ల కావడం లేదు. లా కంపెనీలు రావడం వల్ల యువకులకు అవకాశాలు వస్తున్నాయని, కానీ కార్పొరేట్ ఫీజులను పేదలు భరించలేరని, తద్వారా సామాన్యులకు న్యాయం దూరమవుతుందని రిటైర్డ్ జస్టిస్ ఎన్వీ రమణ గతంలో నొక్కిచెప్పారు.

అంటే.. 'న్యాయం' ఇప్పుడు ఖరీదుగా మారిందనే విషయం అర్థమవుతూనే ఉన్నది. అంతేకాదు, కోర్టు విధానాలు, సేవలపై పేదలకు సరైన అవగాహన ఉండటం లేదు. కేసులు, కోర్టులు అనగానే చాలామంది ప్రజలు భయాందోళనకు గురై వెనుకడుగు వేస్తున్నారు. దీంతో అంగబలం, ధన బలం ఉన్న అక్రమార్కులపై పేద ప్రజలు ఓడిపోతున్నారు. లాయర్‌ను పెట్టుకునే ఆర్థిక స్థోమత లేనివారికి ప్రభుత్వమే ఉచితంగా న్యాయ సహాయం అందిస్తుందనే విషయంపై పేదలకు సమగ్ర అవగాహన కల్పించాలి. న్యాయసహాయం కోసం దరఖాస్తు చేసుకున్నవారికి జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఒక లాయర్‌ను కేటాయిస్తుంది. అంతేకాదు, అవసరమైతే కోర్టు ఫీజులు, సాక్షులకు సంబంధించిన వ్యయాలు, మరే ఇతరత్రా ఖర్చులున్నా ఆ సంస్థ భరిస్తుంది. ఉచిత న్యాయ సేవలు పొందాలనుకునేవారు తమ కేసు ఏ కోర్టు పరిధిలోకి వస్తుందో తెలుసుకుని అక్కడి న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకునే వీలుంది.

సమయానికి అందని న్యాయం కూడా అన్యాయంతో సమానం. ఒక్కమాటలో చెప్పాలంటే అది కూడా ఒక శిక్ష లాంటిదే. ఏ తప్పు చేయనివారికి, బాధితులకు పడే శిక్ష అది. న్యాయం ఆలస్యమవడమనేది పెద్దల దృష్టిలో చిన్న సమస్యే కావచ్చు. కానీ, పేదలకు మాత్రం అది జీవన్మరణ సమస్య. ఈ నేపథ్యంలో కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, అధికారుల స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలను త్వరితగతిన పరిష్కరించి పేదలకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నది.

'స్వాతంత్ర్యమంటే ఏమిటో నిర్వచించుకోలేని దశలోనే దశాబ్దాలు గడిచిపోవడం నిజంగా విషాదకరం' అని అన్నారు ఆరుద్ర. స్వాతంత్ర్య పోరాటంలో ఆస్తులు, అశువులు కోల్పోయిన యోధులంతా నేడు తిరిగి పుట్టినా (బహుశా) పరిస్థితుల్లో మార్పు రాదేమో! దేశంలో ఎన్నెన్నో మార్పులు, అభివృద్ధి అనివార్యమయ్యాయి.

ఏది నిజమైన స్వాతంత్ర్యం?

భమిడిపాటి గౌరీశంకర్
94928 58395

సాంకేతిక రంగంలో వినూత్నమైన ఆవిష్కరణలు జరిగాయి. చంద్రుని మీదికి ప్రయాణాలు విస్తృతమయ్యాయి. ఆర్థికపరమైన వృద్ధి సాధ్యమైంది. దేశం అభివృద్ధిలో అంగలు వేసింది. ప్రతీ రంగంలో ఈ మార్పు కనిపిస్తున్నది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ)తో మనుషులను సజీవంగా యాంత్రికతతో నిలుపుతున్నాం. మానవ రహిత వ్యోమనౌకలను అంతరిక్షంలోకి పంపగలుగుతున్నాం. దేశ స్వాతంత్ర్యం అంటే ఇంతేనా అనే 'విరుపులు' ఉన్నాయి. ఈ మెరుపులు నాణేనికి ఒకవైపు. మరి రెండోవైపు? 'ఆకాశం అందుకునే ధరలు ఒకవైపు, అంతులేని నిరుద్యోగం ఇంకొక వైపు/ అవినీతి, బంధుప్రీతి చీకటి బజారు' అని శ్రీశ్రీ ఐదు దశాబ్దాల కిందటనే ఆవేదనను వ్యక్తం చేశారు. ఏడున్నర పదుల స్వాతంత్ర్యం పూర్తిచేసుకున్న నాటికీ మహాకవి ఆవేదన అక్షర సత్యంగానే మిగలటం ఆవేదన కలిగిస్తున్నది. 'భారతదేశ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా దేశంలోని ఆసేతు హిమాచల పర్యంత ప్రజలంతా ప్రగతి ఫలాలు అందుకోవాల'ని ఆశించిన నెహ్రూ కలలు 'కల్ల' కావటం శోచనీయం.

నాలుగు వైపులా నీరున్నా 'అన్నదాతకు' బతుకు భరోసా లేదు. పీజీలు చేసినా పిడికెడు బువ్వ కోసం యువత నిరంతరం పోరాడుతూనే ఉన్నది. అటవీ ప్రాంతంలో అభివృద్ధి ఛాయలు పావు వంతు కూడా కనపడటం లేదు. అటవీ సంపద, 'ఆటవిక' జీవనం కింద నలుగుతున్న వైనం దేశ యవనికపై నిత్య దృశ్యం. ఆదివాసుల జీవనం ఎంత దుర్భరంగా మారినా పట్టించుకునే నాయకులు లేరు. కరెంటు, తాగునీరు, రహదారి సౌకర్యం లేని ఆదివాసీల సంఖ్య 12 నుంచి 18కి చేరిందని ప్రభుత్వ గణాంకాలే చెప్తున్నాయి. ఆగస్టు 15న జెండాకు వందనం చేసే నాయకులు సైతం ఏది నిజమైన స్వాతంత్ర్యం? నిజంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందా? అని సందేహం వ్యక్తం చేస్తున్నారు. రాజ్యాంగ ప్రవేశికలో భారతదేశం 'లౌకిక దేశమని' పేర్కొన్నారు. ఆ ఛాయలు మాత్రం (మణి)పూర్‌గానే ఉన్నాయి. ఎవరు బాధ్యులంటే అంతటా 'నిశ్శబ్దం' ఆవహిస్తున్నది. భాష, కులం, మతం, ప్రాంతం, వర్గం ఇవి నేడు దేశాన్ని నడిపిస్తున్న తరుణంలో 'పాడవోయి భారతీయుడా ప్రగతి గీతిక'ని ఎలా నినదించాలి. అధికారం ప్రజాపాలనకు, వారి అభివృద్ధికి నాయకులు వినియోగించాలని చెప్పిన రాజ్యాంగ నిర్మాత(ల) ఉపదేశాలు కేవలం నాయకుల ఉపన్యాసాలకే పరిమితం కావటం మరో విషాదం.

స్త్రీ, బాలికల సంరక్షణ అంకెలు ఘనం, ఆచరణ శూన్యం. మండుతున్న ప్రాంతాలు ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం. దేశంలో అశాంతి పెరిగితే, అది దేశ సమగ్రతకు, సార్వభౌమాధికారానికి చేటు. స్వాతంత్ర్యం అనేది కేవలం నామమాత్రపు అంశంగా ఏర్పడే అవకాశం ఉన్నదని బాబు రాజేంద్రప్రసాద్ నాడే హెచ్చరించారు. 'తిలాపాపం తలా పిడికెడు' అన్నట్టు దేశంలో ఉగ్రవాద ఉద్యమ విషసర్పాలకు పాలు పోసి పెంచి పోషించిన పాపం పాలకులదే. తదుపరి ఆ పాము కాట్లకు బలైనది కూడా వారే. మరి వర్తమాన, రాబోయే తరాలకు ఏది నిజమైన స్వాతంత్ర్యమో ఎలా వివరించగలం?

విశ్వవిద్యాలయాలు, విద్యాలయాలు సైతం స్వాతంత్ర్య దినోత్సవం కోసం ఆటలు ఆడిస్తున్నాయి. పలురకాల పోటీలు పెట్టి బహుమతులు ఇస్తున్నాయి. కానీ, ఆగస్టు 15 గొప్పతనం, స్వాతంత్ర్య పోరాటాల గురించి వివరించే సిలబస్‌లను మాత్రం దూరం చేస్తున్నాయి. తల్లిదండ్రులకు సైతం ఆగస్టు 15న సెలవే. మరి వారు తమ పిల్లలకు ఏం చెప్తున్నారు? కవులు, కళాకారులు సైతం ప్రభుత్వ సేవలో ఉంటూ వారిచ్చే పురస్కారాల కోసం పరితపిస్తున్నారు. మరి ఏది నిజమైన స్వాతంత్ర్యమో యువతకు చెప్పేదెవరు? ఆ దిశగా ఆలోచింపజేసేదెవరు? అభివృద్ధి అంటే సాంకేతికంగా ఎదగడం కాదు. సంపద, ఉత్పత్తి, శ్రమ, పెట్టుబడులకు సమానమైన ఫలితం దక్కటం. సామాన్యుడి నుంచి సంపన్నుల వరకు స్వాతంత్ర్య ఫలాలను, కనీస సౌకర్యాలను పొందగలగటం. భద్రతతో కూడిన బతుకును స్వేచ్ఛగా అనుభవించగలగటం. భ్రమలు లేని వాస్తవ సమాజాన్ని నిర్మించడం కోసమే 1857 నుంచి 1947 వరకు ఉధృతంగా పోరాటాలు చేసి ధన, మాన, ప్రాణాలను తృణంగా సమర్పించిన నిస్వార్థ నాయకుల జీవితం గురించి వివరించాల్సిన అవసరం వర్తమానంలో ఉన్నది. కానీ, ఆ దిశగా 'విద్యా విధానం'లో తగు మార్గదర్శక సూత్రాల్లేవు. ఉన్నా, వాటిని సైతం రాజకీయ, మత ప్రయోజనాల ప్రాతిపదికగా పుస్తకాల నుంచి తీసేయడం ఎటువంటి పునర్నిర్మాణమో పాలకులే చెప్పాలి. 'సమ సమాజమనే కల వాస్తవం కాదని, యాభై ఏండ్ల స్వాతంత్ర్యం నాకు చెప్పింది. కానీ, సమన్యాయం, తిండి, విద్య, వైద్యం కూడా అందరికీ అందని ఫలాలని నాకు అర్థమైంది. మరెందుకీ స్వాతంత్ర్యమని భవిష్యత్ తరాలు చింతిస్తే ఆ తప్పునకు ఎవరు బాధ్యత తీసుకుంటార'న్న అలిశెట్టి ప్రభాకర్ వ్యాఖ్యానం నేటికీ సత్యం.